క్లుప్తంగా

ధర్నా

బొబ్బిలి: స్థానిక జూట్‌మిల్లు ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పెన్షనర్లు సోమవారం ధర్నా చేపట్టారు. పీఎఫ్ పెన్షన్‌ను రూ.9 వేలు చేసి, డీఏ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.శేషగిరిరావు, పెన్షనర్లు ఎస్.గోపాలం, టి.రమణ, జి.సింహాచలం, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

రాజాం సిటీ: ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కంచరాం గ్రామ బీసీ కాలనీలో రూ.8.20 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు, కాలువల నిర్మాణాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఆయన వెంట ఏపీవో సాయిరాం, తదితరులు ఉన్నారు.

వీల్‌చైర్ వితరణ

రాజాం సిటీ: అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితమైన మండలంలోని వీఆర్‌అగ్రహారం గ్రామానికి చెందిన లింగాల జ్ఞానేశ్వరరావుకు శ్రీకాకుళానికి చెందిన ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ సంస్థ సభ్యులు సోమవారం వీల్‌చైర్ వితరణ చేశారు. ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ జీవన్ మడపాల సహకారంతో ఈ కుర్చీని సమకూర్చి ఇచ్చామని వారు తెలిపారు. ఈ తరహా సేవలు అవసరమైన వారు ఫోన్ నంబర్ 9701698408ను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

రేగిడి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని బూరాడ పీహెచ్‌సీ 104 వాహన ఉద్యోగులు వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు ఏవీ సత్యనారాయణ, కె.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

బొబ్బిలి: ఆస్తి పంపకాల్లో జరిగిన గొడవలో కారణంగా పట్టణానికి చెందిన జయకృష్ణ గాయపడ్డాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని సీహెచ్‌సీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన వారణాసి కోటేశ్వరరావు, వెంకటరమణలు సోదరులు.. వారి మధ్య ఆస్తి పంపకాల విషయమై కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి జరిగిన గొడవ నేపథ్యంలో వెంకటరమణ కొడుకు చైతన్య.. కోటేశ్వరరావు కొడుకు జయకృష్ణ తలపై రాడ్డుతో దాడి చేసి గాయపరిచాడు.

పౌరసేవల్లో అలసత్వం వద్దు

రాజాం సిటీ: గ్రామ సచివాలయ సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కంచరాం గ్రామ సచివాలయాన్ని ఆయన సోమవారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పౌరసేవల్లో అలసత్వం వహించవద్దని, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న ఇళ్ల సర్వేను పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏపీవో సాయిరాం తదితరులు ఉన్నారు.

నైపుణ్య శిక్షణతోనే ఉపాధి అవకాశాలు

రామభద్రపురం: నైపుణ్య శిక్షణతోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీడీవో రత్నం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సచివాయ సిబ్బందితో సోమవారం సమావేశమైన ఆమె.. నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు నిరుద్యోగుల కోసం ఇంటింటా సర్వే చేయాలని సూచించారు. సర్వే ఏ విధంగా చేయాలన్న దానిని వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సీహెచ్ సన్యాసిరావు, ఈవోపీఆర్డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో సందర్శన

రేగిడి: మండలంలోని కొండవలస, సరసనాపల్లి, జోడిబందల తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో ఎంపీ ప్రసాదరావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డుల నిర్వహణతో పాటు విద్యార్థుల హాజరు, సిబ్బంది పనితీరు, అపార్ నమోదు శాతం, మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలుపై ఆయన ఆరాతీసి, పలు సూచనలు చేశారు. కొండవలస యూపీ పాఠశాలలో ఆంగ్లభాష పరిజ్ఞానంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈవో చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

వాహన తనిఖీలు

సంతకవిటి: మండల పరిధిలోని జోలపేట జంక్షన్ వద్ద పోలీసులు సోమవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి వాహన ధ్రువపత్రాలు పరిశీలించారు. సంబంధిత ధ్రువపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

అమ్మో హాస్టళ్లు..!

- కనీస సౌకర్యాలకు నోచుకోని వసతిగృహాలు
- శిథిలావస్థలో హాస్టల్ భవనాలు
- కానరాని పారిశుధ్యం
- కొరవడిన రక్షణ చర్యలు
- తూతూమంత్రంగా అధికారుల పర్యవేక్షణ
- హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వం అలసత్వం

పగిలిన కిటికీల అద్దాలు.. ఊడిపోయిన ద్వారాల తలుపులు.. అపరిశుభ్రంగా కనిపించే మరుగుదొడ్లు.. అధ్వానంగా తయారైన స్నానపుగదులు.. శిథిలావస్థకు చేరిన భవనాలు, అస్తవ్యస్తంగా కనిపించే పరిసరాలు.. ఇదీ మెజార్టీ ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల పరిస్థితి. కనీస సదుపాయాలు లేని ఇటువంటి హాస్టళ్లలో ఉండేందుకు విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. ఇంటి నుంచి హాస్టల్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం.. రక్షణ చర్యలు చేపట్టకపోవడం.. మరమ్మతులకు నిధులు కేటాయింపు చేయకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


బొబ్బిలి ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో పెట్టెలు పెట్టుకున్న చోటే విద్యార్థుల భోజనాలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

రాజాం:

పట్టణంలో మొత్తం ఐదు సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. వీటిలో మూడు బాలికలకు సంబంధించినవి కాగా, మిగిలిన రెండు బాలురుకు సంబంధించినవి. బాలికల వసతిగృహాల్లో బీసీ జనరల్ బాలికల కళాశాల వసతిగృహాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే వ్యాపార సంస్థల నడుమ ఈ వసతిగృహం ఉండడంతో నిత్యం ఇక్కడకు వచ్చే వ్యాపారులు, ఆకతాయిల వల్ల విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. తమకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సీసీ కెమరాలు అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బయట నుంచి టిఫిన్..

శ్రీకాకుళం రోడ్డులోని సాంఘిక సంక్షేమ పోస్ట్ మెట్రిక్ బాలురు వసతిగృహంలోని విద్యార్థులు బయట దుకాణాల నుంచి టిఫిన్, భోజనాలు తెప్పించుకుంటున్నారు. సోమవారం 'సాక్షి' ఎదుట ఈ దృశ్యాలు కనిపించాయి. మెనూ సక్రమంగా లేదని, వండిన వంటకాలు రుచికరంగా ఉండడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే వసతిగృహానికి చెందిన విద్యార్థులు రాత్రి సమయాల్లో బయటకు వచ్చి ప్రమాదాలకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇదంతా సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లేనని స్థానికులు అంటున్నారు. ఇదిలా ఉండగా, పాలకొండ రోడ్డులోని పోస్ట్ మెట్రిక్ బీసీ బాలురు వసతిగృహంలో మరుగుదొడ్లు, స్నానపుగదుల సమస్య ఉంది. గురవాం కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం) గ్రామ శివారున ఉండగా, సీసీ కెమరాల నిఘా కూడా లేదు. అలాగే విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు, స్నానపుగదులు లేవు. కాస్మోటిక్స్ కూడా గతంలో మాదిరిగా సకాలంలో ఇవ్వడం లేదు.


శిథిలావస్థలో భవనం..


ప్రమాదకరంగా రేగిడి మండలంలోని ఏవీపురం హాస్టల్

రేగిడి మండలంలోని ఏవీపురంలో బీసీ బాలురు వసతిగృహం భవనం శిథిలావస్థలో ఉంది. ఇక్కడ ఎటువంటి మౌలిక వసతులు లేవు. మండలంలోని దేవుదళ కేజీబీవీదీ అదే పరిస్థితి. ఇక్కడ కూడా సరైన సదుపాయాలు లేవు. ఉంగరాడమెట్ట దగ్గరున్న రెసిడెన్షియల్ స్కూల్‌పై కూడా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా విద్యార్థులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

అద్దె భవనాల్లో నిర్వహణ..

సంతకవిటి మండలంలో రెండు బీసీ బాలురు వసతిగృహాలతో పాటు ఒక ఎస్సీ బాలురు వసతిగృహం ఉంది. రెండు బీసీ బాలురు వసతిగృహాలూ అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. సంతకవిటిలోని బీసీ బాలురు వసతిగృహంలో అయితే మరుగుదొడ్లు, గదుల సమస్య ఉంది. ముఖ్యంగా స్నానపుగదుల కొరత ఉండడంతో ఇక్కడి విద్యార్థుల ఆరుబయటకు స్నానాలకు వెళ్తున్నారు. నైట్ వాచ్‌మన్‌లు కూడా లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ ఏది అని తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. గుళ్లసీతారాంపురంలోని ఎస్సీ బాలురు వసతిగృహంలో సీసీ కెమరాలు లేవు. విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ లేదు. కాస్మోటిక్స్ కూడా విద్యార్థులకు సకాలంలో ఇవ్వడం లేదు. ఇదే మండలంలోని వాసుదేవపట్నం కేజీబీవీ విద్యార్థినులకూ వసతి సమస్య ఉంది. ఇక్కడ 6 నుంచి 12 తరగతుల వారు ఉండగా, సరిపడ స్నానపు గదులు లేవు. తాగునీటి సమస్య వేధిస్తోంది.


అపరిశుభ్రంగా రాజాం బీసీ బాలురు వసతిగృహం మరుగుదొడ్లు


రాజాంలో తలుపులు లేని ఎస్సీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ గది


అద్దె భవనంలో నిర్వహిస్తున్న సంతకవిటి బీసీ వసతిగృహం

తనిఖీలు శూన్యం..

వంగర మండలంలో ఒక వసతిగృహంతో పాటు ఒక రెసిడెన్సియల్ స్కూల్, ఒక కేజీబీవీ ఉన్నాయి. వీటిల్లో అధికారుల పర్యవేక్షణ లేదు. డైనింగ్ హాల్ సదుపాయం లేక అక్కడే భోజనాలు, అక్కడే చదువులు, అక్కడే పడుకోవడం వంటివి చేస్తున్నారు. ఎం.సీతారాపురం బీసీ బాలురు వసతిగృహంలో తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారుల తనిఖీలు ఒక్కసారి కూడా జరగడం లేదు. మడ్డువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల మైదానం మీదుగానే రైతులు తమ పంటపొలాలకు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో అక్కడి విద్యార్థులు రక్షణ లేదని భయందోళన వ్యక్తం చేస్తున్నారు.

రన్నింగ్ వాటర్ సమస్య..

బొబ్బిలి: నియోజకవర్గంలో ఐదు ఎస్సీ వసతిగృహాలు, ఏడు బీసీ వసతిగృహాలు ఉన్నాయి. ఇవి కాకుండా ఒక గిరిజన ఆశ్రమ పాఠశాల, మరొక కేజీబీవీ, రెండు గురుకుల పాఠశాలల వసతిగృహాలు ఉన్నాయి. ఈ వసతిగృహాల్లో మొత్తం 2,164 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రహరీలు లేని వసతిగృహాలు తెర్లాం, బొబ్బిలి మండలాల్లో ఉన్నాయి. స్నానపుగదులు, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సమస్య కూడా ఉంది. అద్దె భవనాల్లో నాలుగు వసతిగృహాలు నిర్వహిస్తున్నారు. దీంతో చాలీచాలని గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బొబ్బిలి ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహంలో పుస్తకాలు, పెట్టెలు భద్రపరిచిన చోటే నిద్రపోవడం, ఆహారం తీసుకోవడం చేస్తున్నారు. స్నానపు గదులున్నా రన్నింగ్ వాటర్ లేక(ప్రహరీ లోపల) గదుల వెలుపలే స్నానాలు చేస్తున్నారు. ఎస్సీ కళాశాల బాలురు వసతిగృహానికి కూడా ప్రహరీ లేదు. బట్టలు ఉతికే చోటు అపరిశుభ్రంగా ఉంది. బాడంగి బీసీ హాస్టల్‌లో రన్నింగ్ వాటర్ సమస్యతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి.


బాడంగి ఎస్సీ హాస్టల్‌లో పెచ్చులూడిన శ్లాబు


రామభద్రపురం హాస్టల్‌లో శిథిలావస్థలో విద్యార్థుల స్నానపుగదులు

వర్షమొస్తే.. కారిపోతోంది..

పెరుమాళి ఎస్సీ బాలురు వసతిగృహానికి ప్రహరీ లేక కర్రలతో తాత్కాలిక ప్రహరీ ఏర్పాటు చేశారు. పాత భవనం కూడా కావడంతో వర్షమొస్తే కొన్ని గదులు కారిపోతున్నాయి. తాగునీరు సరిగా అందడం లేదని, మరో బోరుబావి మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. రామభద్రపురం మండల కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలురు వసతిగృహంలో స్నానపుగదులతో పాటు భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అలాగే కొన్ని కిటికీల తలుపులు కూడా లేవు. కాస్మోటిక్స్ చార్జీలు కూడా సరిగ్గా ఇవ్వడం లేదు. జూన్ నెల నుంచి మెస్ చార్జీలు సైతం చెల్లించకపోవడంతో వసతిగృహ నిర్వాహకులు ఏది పెడితే అది తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. బూసాయవలస కేజీబీవీలో 240 మంది విద్యార్థినులు ఉండగా, వారికి సరిపడ పరుపులు, దుప్పట్లు సరఫరా చేయలేదు. ప్రస్తుతం చలికాలం రావడంతో ఇంటి దగ్గర నుంచి తెప్పించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.


బొబ్బిలి ఎస్సీ బాలురు కళాశాల వసతిగృహంలో పనిచేయని వాటర్ ప్యూరిఫయర్

పెచ్చులూడిన శ్లాబు..

ఇదే మండల కేంద్రంలోని ఎస్సీ వసతిగృహం శ్లాబు పెచ్చులూడిపోవడంతో వర్షానికి కారిపోతోందని విద్యార్థులు వాపోతున్నారు. అలాగే బాడంగి ఎస్సీ వసతిగృహం డార్మిటరీ కిటికీలకు తలుపులు లేవు. బాడంగి బీసీ వసతిగృహంలో రన్నింగ్ వాటర్ సమస్యతో మరుగుదొడ్లు ఉపయోగించడం లేదు. టీవీ కూడా పాడైంది. ఎస్సీ హాస్టల్‌లో వాటర్ ప్యూరిఫయర్ ఉన్నా విద్యార్థులకు మంచినీరు అందడం లేదు. తెర్లాం మండలంలోని తెర్లాం, పెరుమాళి గ్రామాల్లో ఎస్సీ బాలురు వసతిగృహాలు, తెర్లాంలో బీసీ బాలురు వసతిగృహం ఉన్నాయి. బీసీ బాలురు వసతిగృహానికి గత 30 ఏళ్లుగా సొంత భవనం కూడా లేదు. ఇప్పటికీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. చాలీచాలని స్నానపుగదులు, మరుగుదొడ్లు ఉన్నాయి. ఇక్కడి ఎస్సీ బాలురు వసతిగృహం భవనం సైతం పూర్తిగా శిథిలమైంది. రన్నింగ్ వాటర్ సదుపాయం లేక స్నానపు గదులు నిరుపయోగంగా మారాయి.

మార్మోగిన శివనామస్మరణ

కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకుని, ప్రముఖ శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పరమ పవిత్రంగా భావించే ఈ మాసంలో సోమవారాల్లో పూజలకు భక్తులు అత్యంత ప్రాధాన్యమిస్తారు. వేకువ జాము నుంచే మందిరాలకు పోటెత్తిన భక్తజనం.. గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని మనసారా దేవుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు. భక్తుల హరహర మహాదేవ.. శంభో శంకర.. శంభో శివ శంభో.. నినాదాలతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి.


రాజాం: బొద్దాం ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు


రాజాం సిటీ: రాజాం గాయత్రి కాలనీలోని కాశీ విశ్వేశ్వరాలయ ఆవరణలో భక్తుల దీపారాధన


తెర్లాం: కొరటాం శివాలయంలో భక్తుల పూజలు


వంగర: సంగాంలోని సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు


రామభద్రపురం: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


బాడంగి: భక్తులతో కిక్కిరిసిన పిన్నవలస శివాలయం


రేగిడి: భక్తులతో కిటకిటలాడుతున్న సంకిలి శివాలయం


సంతకవిటి: మందరాడ ముఖలింగేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన


బొబ్బిలి రూరల్: జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

న్యాయ అవగాహన సదస్సు

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస గ్రామ సమీపంలోని ఏసియన్ ఎయిడెడ్ అంధుల పాఠశాలలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. మండల లీగల్ సెల్ ప్యానల్ న్యాయవాది ఎల్.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు.

పోగొట్టుకున్న బ్రాస్‌లెట్ అందజేత

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని దిబ్బ వీధి శివాలయం వద్ద బంగారం బ్రాస్‌లెట్ పోగొట్టుకున్న కింతలి నర్సింహమూర్తికి సోమవారం ఆ బ్రాస్‌లెట్ అందజేశారు. ఆదివారం ఆయన చేతి నుంచి జారిపడిపోయిన బ్రాస్‌లెట్.. ఇదే పట్టణంలోని ఎనిమిదో వార్డుకు చెందిన మారోజు శంకరరావు సతీమణికి ఆ బ్రాస్‌లెట్ దొరికింది. ఆ బ్రాస్‌లెట్ ఎవరిది అని ఆరాతీయగా, నర్సింహమూర్తికి చెందినదిగా తెలిసింది. పోలీసుల ద్వారా బాధితుడికి బ్రాస్‌లెట్ అప్పగించి, నిజాయితీని చాటుకున్నారు.

ఆర్థికసాయం

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో ఇటీవల కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కెకె రంగారావు(బేబీనాయన) గొర్రెల యజమానులకు తన సొంత నిధుల నుంచి రూ.15 వేలు చొప్పున ఆర్థికసాయం చేశారు.

డి-క్రిషి యాప్ ద్వారా విత్తనాలు

సాక్షి ఎఫెక్ట్...

రాజాం: నియోజకవర్గంలోని రైతులకు రబీ సాగుకు సంబంధించి, ఏపీ సీడ్స్ ద్వారా 100.2 క్వింటాళ్ల అపరాల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. అపరాల విత్తనాల కొరతపై ఈ నెల 17వ తేదీన 'సాక్షి'లో అపరాల విత్తనాలేవీ? అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. విత్తనాల కోసం డి-క్రిషి యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, అవసరమైన నగదును రైతుసేవా కేంద్రాల్లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు అందించాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1114.9 క్వింటాళ్ల వరి, అపరాలు, పచ్చిరొట్ట, వేరుశనగ విత్తనాలను అందుబాటులో ఉన్నాయన్నారు.

నైపుణ్యాభివృద్ధికి ఏఐసీటీఈ దోహదం

రాజాం సిటీ: ఐటీ కళాశాలల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీలో దాగిఉన్న నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ఏఐసీటీఈ దోహదపడుతుందని వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ వై.రవికుమార్ తెలిపారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఏఐసీటీఈ(కణజాలం మరియు అవయవాల బయో ప్రింటింగ్, యాన్ ఎవల్యూషన్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెటీరియల్స్) కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ రంగంపై పరిశోధనను కొనసాగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇది జ్ఞానం మాత్రమే కాకుండా విశ్వాసాన్ని అందించే దశ అని, వృత్తి నైపుణ్యాలను పెంపొందించడానికి విలువైన ఆహ్వానమన్నారు. ఈ ప్రోగ్రాం బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చడానికి, బయో ఇంజినీరింగ్ రంగంలో కొత్త పరిశోధనలను ప్రోత్సహించడానికి అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ పీఎస్ఎల్ పావని మాట్లాడుతూ బయో ప్రింటింగ్ టెక్నాలజీ ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను విప్లవాత్మకంగా మార్చే సామర్థ్యాన్ని కలిగి ఉందని వివరించారు. బయో ప్రింటింగ్ కేవలం సాంకేతికత మాత్రమే కాదని అవయవ మార్పిడి, పునరుత్పత్తి ఔషధంలో స్థిరమైన పరిష్కారాలకు మార్గం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి 35 మంది ప్రొఫెసర్లు హాజరు కాగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, కో కన్వీనర్ డాక్టర్ ఏఎల్ నాయుడు, డాక్టర్ జి.శశికుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

తెర్లాం: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా రైతు భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రీసర్వే డిప్యూటీ తహసీల్దారు రవికిరణ్ అన్నారు. మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆయన.. పలువురు రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. భూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి సీఐ కటకం సతీష్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని కారాడ గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రామసభకు హాజరైన ఆయన.. గంజాయి రవాణాతో పాటు అక్రమ మద్యం తరలింపుపై కూడా నిఘా ఉంచామన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులపై క్లిక్ చేయొద్దన్నారు. అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు.